క్లుప్తంగా

బుచ్చెయ్యపేట తహసీల్దార్‌గా వెంకటేశ్వరరావు


నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

బుచ్చెయ్యపేట: స్థానిక తహసీల్దార్‌గా కె. వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్ ఎస్.వి. అంబేడ్కర్‌ను నక్కపల్లికి, రోలుగుంట తహసీల్దార్ వెంకటేశ్వరరావును బుచ్చెయ్యపేటకు బదలీ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన తహసీల్దార్‌ను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఆర్ఐ శ్రావణ్, సీనియర్ అసిస్టెంట్ చందర్రావు, వీఆర్వోల సంఘ నాయకుడు జెట్టి సుధాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రావణాపల్లి ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం


ఉప సర్పంచ్‌గా ఎన్నికైన సత్యవతికి నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

గొలుగొండ: రావణాపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా రాజాన సత్యవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్నెల్ల క్రితం ఇక్కడ ఉప సర్పంచ్ అప్పలనాయుడు మృతితో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఈ మేరకు ఎన్నిక అధికారి, డివిజన్ పంచాయతీ అధికారి ఎస్.ఎస్.ఎన్ మూర్తి ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ ఎన్నిక నిర్వహించగా, ఎనిమిది మంది వార్డు మెంబర్లుగాను అందరు ఆమెను ఎన్నుకున్నారు. దీంతో సత్యవతికి ధ్రువీకరణపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, పంచాయతీ కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

హెచ్‌డీటీగా మురళీధర్



రావికమతం: డిప్యూటీ తహసీల్దార్‌గా ఆర్.వి. మురళీధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. రోలుగుంట హెచ్‌డీటీ వరహాలు ఇంతవరకూ ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేసేవారు. బుచ్చెయ్యపేట మండలం నుంచి వచ్చిన మురళీధర్ ఇక్కడ విధుల్లో చేరారు.

అంకితభావంతో పనిచేస్తే మన్ననలు


బదిలీ సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ మహమ్మద్

రావికమతం: మూడేళ్లుగా అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని, అదే స్ఫూర్తితో బదిలీపై ఏ ప్రాంతానికి వెళ్లినా గుర్తింపు తెచ్చుకోవాలని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ తెలిపారు. కొత్తకోట సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న ఐడబ్ల్యూ అచ్చియ్యతోపాటు రావికమతం, కొత్తకోట, బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్లలో పనిచేస్తూ బదిలీ అయిన ఎనిమిది మంది పోలీసు సిబ్బందిని సీఐతోపాటు ఎస్ఐలు బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు.

డొంకాడ గిరిజన గ్రామంలో వైద్య శిబిరం


డొంకాడ గిరిజనులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: మండలంలో మారుమూల గిరిజన గ్రామం డొంకాడలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆరిల్లోవ అటవీ ప్రాంతం నుంచి అడవి, గెడ్డలు దాటి ఆరు కిలోమీటర్ల మేర నడిచి గురువారం ఆ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ వైద్య శిబిరంలో పాల్గొని 114 మంది రోగులను పరీక్షించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మొదటిసారి గ్రామానికి వైద్య సిబ్బంది వచ్చి సేవలందించడంపై గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులు డి. ధనంజయ్, మధుసూదనరావు, అశ్విని శైలజతో పాటు 104 సిబ్బంది వెంకట అప్పారావు, పాల్గొన్నారు.

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మంచినీటి పథకాలు

- రూ. 51 కోట్లతో దేవరాపల్లి మండలంలో ప్రతి ఇంటికీ కుళాయి
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో డిప్యూటీ సీఎం బూడి సమీక్ష


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: భవిష్యత్తు మంచినీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఇంటికి కుళాయి నీరు పుష్కలంగా అందించడమే తన ఆశయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. రానున్న 25 ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా దేవరాపల్లి మండలంలో రూ. 51 కోట్లతో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహంలో మాడుగుల నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, దేవరాపల్లి ఏఈ కె. చంద్రశేఖర్‌రావులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. దేవరాపల్లి మండలంలో జలజీవన్ మిషన్ పథకం పనులపై సమీక్షించారు. రాజకీయాలకతీతంగా మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండలంలోని 27 పంచాయతీల్లో రూ. 51 కోట్లతో చేపట్టిన 219 పనులు వివిధ దశల్లో ఉన్నాయని, 16,570 ఇళ్లకు మంచినీటి కుళాయి సౌకర్యం కల్పిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. దేవరాపల్లి పంచాయతీలో రూ.5.58 కోట్లతో ఈ పనులు చేస్తున్నామన్నారు. రోజూ పనుల పురోగతిని తనకు తెలియజేయాలని, గ్రామాల్లో ఎక్కడైనా పనులకు ఆటంకం కలిగితే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ పనుల వేగవంతానికి కాంట్రాక్టర్లను ప్రోత్సహించాలన్నారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి సంబంధిత శాఖ ఏఈ కె. శంకరరావును రప్పించి పనులకు ఆటంకం లేకుండా స్తంభాలను సరిచేయాలని ఆదేశించారు. ప్రతి నెలా మొదటి వారంలో సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

సచివాలయంలోనే అన్ని శాఖల సేవలు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ, ఎంపీపీ

రోలుగుంట: అన్ని శాఖల సేవలు గ్రామ సచివాలయంలోనే లభిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలోని బుచ్చింపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావుతో కలసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో అన్ని శాఖల సేవలందించాలనే సత్సంకల్పంతో సచివాలయ వ్యవస్థను రూపొందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సత్యవతి తన దృష్టికి తీసుకొచ్చిన అభివృద్ధి పనుల కోసం రూ.9 కోట్లు మంజూరు చేశామన్నారు. ప్రధానంగా ఇక్కడ ఎంతో విశిష్టత కలిగిన మినీ కైలాసగిరి వద్ద కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశానన్నారు. కోరిన వెంటనే నిధుల మంజూరు చేసిన ధర్మశ్రీకి వైఎస్సార్‌సీపీ జిల్లా విభాగం కార్యవర్గ సభ్యుడు ఉలబాల రాము, సర్పంచ్, ఎంపీటీసీలు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో ప్రభాకరరావు, పీఆర్ డీఈ ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి మట్ల రాజశేఖర్, ఏపీఎం సాధన పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

- నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్


బయ్యవరంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: గ్రామాల్లో సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మధ్యాహ్నం బయ్యవరంలో ఆయన ఇంటింటికీ తిరిగారు. మండుటెండలోనూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారని, నీరు ఇంకా నీరు అందించలేదని ఎమ్మెల్యే ఎదుట మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో వెంటనే ఆయన స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డితో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, నాయకులు భద్రాచలం, మూకల బాలకృష్ణ, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, సర్పంచ్ లాలం కాశీవిశ్వనాథ్, నాయకుడు సుకల శ్రీను, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధులు దూరం


ర్యాలీలో వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: గ్రామాల్లో మురుగు నిల్వలు ఎక్కువ రోజులు ఉండకుండా వాటిని తొలగించే బాధ్యత ఆయా నివాసాల ప్రజలు తీసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. మలేరియా మాసోత్సవం సందర్భంగా గురువారం మేడిచర్లలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణతో మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చన్నారు. ప్రజలు నిల్వ నీటిని ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎస్.రాజు, హెచ్‌వీ సన్యాసమ్మ, ఏఎన్ఎం దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో సేవలతోనే తగిన గుర్తింపు

సన్మాన సభలో బదిలీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు


బదిలీ అయిన ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, ఉద్యోగులు

రోలుగుంట: విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలతోనే తగిన గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఏడుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. బుధవారం సాయంత్రం ఇక్కడ సన్మాన సభలో వీరిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన వారిలో తహసీల్దార్ కె.వెంకటేశ్వరావు, డి.టి. హెచ్.త్రివేణిలను బుచ్చియ్యపేట మండలం, రీసర్వే డి.టి. ఎస్ నరేంద్రబాబుని నాతవరం, అటెండర్ అమ్మతల్లిని చీడికాడ, వీఆర్వోలు కె.రాజును గొలుగొండ మండలం ఏ.ఎల్ పురం, కె.బుల్లబ్బాయి ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం, బోళం రామచంద్రుడిని నర్సీపట్నం మండలం చెట్టుపల్లి బదిలీ చేశారు. వీరిని ఎంపీపీ శ్రీనివాసరావు, ఉద్యోగులు ఘనంగా సత్కరించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు.

ఘనంగా దుర్గాలమ్మతల్లి పండగ


ఎడ్ల పోటీలో దౌడు తీస్తున్న ఎడ్లు

చోడవరం రూరల్: పట్టణం పరిధి దుర్గాలమ్మ కాలనీలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద జాతరతోపాటు ఎడ్లబళ్ల పరుగు ప్రదర్శన, గుర్రపు స్వారీ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఎడ్లపోటీల్లో అర్జునగిరికి చెందిన పతివాడ నాయుడు ఎడ్ల జత విజేతగా నిలిచింది. లెక్కలవానిపాలేనికి చెందిన పైడితల్లమ్మ ఎడ్లు ద్వితీయ స్థానం, నర్సయ్యపేటకు చెందిన ముమ్మున రామకృష్ణ ఎడ్లు తృతీయ స్థానంలో, మరో జత నాల్గో స్థానంలో నిలిచాయి. కె.జె.పురానికి చెందిన కొయిలాడ మోహన్ ఎడ్లు ఐదు, ఎ.కొత్తపల్లికి చెందిన నంబారు రామకృష్ణ ఎడ్లు ఆరు, సింహాద్రిపురానికి చెందిన అభయాంజనేయ స్వామి ఎడ్లు ఏడు, చుక్కపల్లికి చెందిన మజ్జి దేవానందం ఎడ్లు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. వీటికి వరుసగా రూ.12, రూ.10, రూ.8, రూ.6, రూ.5, రూ.4, రూ.3, రూ.2 వేల బహుమతులు ప్రకటించారు. గుర్రపు స్వారీ పోటీలలో దేవరాపల్లికి చెందిన మాధురి సాయి విజేతగా నిలిచాడు. రాయపురాజుపేటకు చెందిన దాడి నూకహనుమంతరావు ద్వితీయ స్థానం, దేవరాపల్లికి చెందిన నవీన్ చెర్రి తృతీయ స్థానం, రామన్నపాలేనికి చెందిన చౌడుమాంబిక, గజపతినగరం గ్రామానికి చెందిన గుర్రాలు నాలుగు, ఐదు స్థానాలు, రాయపురాజుపేటకు చెందిన దాడి కోటేశ్వరరావు గుర్రం ఆరో స్థానంలో నిలిచాయి. వీటికి వరుసగా రూ.10, రూ.8, రూ.6, రూ.4, రూ.2, వెయ్యి రూపాయల బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

ఈదురుగాలులతో వర్షం

- నేల రాలిన మామిడి పంట


కోళ్ల ఫారం షెడ్లపై ఒరిగిన చెట్లు

కె.కోటపాడు: మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆర్లి, కె.సంతపాలెం, సూదివలస, బత్తివానిపాలెం, గొండుపాలెం గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. ఆర్లిలో వీచిన గాలులకు కోళ్లఫారం షెడ్లపైన చెట్లు విరిగిపడ్డాయి. గొందుపాలెం నుంచి కె.కోటపాడు వెళ్లే మార్గంలో చెట్లు విరిగిపడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కె.కోటపాడు, గుల్లేపల్లి, గొండుపాలెం, కింతాడ గ్రామాల్లో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో రాత్రంతా సరఫరా నిలిచిపోయింది. ఎలక్ట్రికల్ ఏఈ ఎం.చంద్రశేఖర్, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించిన అర్ధరాత్రి సమయానికి కొన్ని గ్రామాలకు, మరి కొన్ని గ్రామాలకు గురువారం ఉదయానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- ఎంపీపీ వేమవరపు రామధర్మజ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రామధర్మజ

మాడుగుల రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ తెలిపారు. తాటిపర్తి గ్రామ పంచాయతీ శివారు కూర్మానాథపురంలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని తయారు చేయడంతోపాటు దళిత, పేదరిక నిర్మూలనకు ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ విగ్రహాన్ని గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ వరహామూర్తి దాతృత్వంతో ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, అదనపు ఎస్ఐ నాగరాజు, సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, మాజీ సర్పంచ్ అల్లంగి సంజీవరావు, గ్రామ దళిత నాయకులు శ్రీపాతిన దేవుడు, నూకరాజు, మామిడి వరహాలు, లకడిపు సుందరరావు, అంబేడ్కర్ యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి


మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: ప్రభుత్వ ప్రాధాన్యం మేరకు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తయ్యేలా వివిధ శాఖల అధికారులు చర్యలను తీసుకోవాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. జగనన్న లేఅవుట్‌ల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా హౌసింగ్ అధికారులు చైతన్యవంతం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని బట్టి నిర్మాణదారులకు బిల్లుల చెల్లింపులను వారి ఖాతాలకు జమ చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై పర్యవేక్షణ ఉండాలని అధికారులకు వివరించారు. రాబోయే వర్షాకాలంలో పారిశుధ్య సమస్య లేకుండా ఉంటే, ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కె.శచీదేవి, ఈవోపీఆర్డీ అప్పారావు, ఉప సర్పంచ్ రెడ్డి అరుణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్.గజపతినగరంలో ఘనంగా మరిడిమాంబ పండగ

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు


మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఎన్.గజపతినగరంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆరేళ్ల తర్వాత నిర్వహించిన ఈ పండగకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి గ్రామస్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మరిడిమాంబ అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జీవీఎంసీ కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, అల్లు శంకరరావు, వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ చిరికి లక్ష్మి, చిరికి నారాయణరావు, రొంగలి సింహాచలంనాయుడు, సచివాలయ కన్వీనర్ చిరికి జగ్గనాయుడు పాల్గొన్నారు.

సుపరిపాలనపై మహాజన సంపర్క అభియాన్

నర్సీపట్నం: దుగ్గాడ రామన్న చెరువులో ఉపాధి కూలీల సమక్షంలో బీజేపీ నాయకులు మహాజన సంపర్క అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి కూలీలకు వివరించారు. నియోజకవర్గ కన్వీనర్ కాళ్ల సుబ్బారావు, నాయకులు చిందాడ నూకేశ్వరరావు, బోళెం శివ, అడిగర్ల సతీష్, లాలం వెంకట రమణరావు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


లక్కవరంలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


అంట్లపాలెంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లక్కవరంలో గురువారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై మహిళలు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో పలు సంక్షేమ పథకాలు, పింఛన్లు రానివారు కొందరు తమ సమస్యలను విన్నవించుకున్నారు. త్వరలో వారికి మంజూరయ్యేలా చూస్తామని ధర్మశ్రీ హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలను సర్పంచ్ శీరంరెడ్డి వెంకటరమణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా మంచినీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోయారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చైతన్య, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ధ గంగరాజు, ఎంపీటీసీలు మట్టా రాజునాయుడు, ఆకిరి లక్ష్మీపతి, వైస్ సర్పంచ్ బండారు నాయుడు, వార్డు మెంబరు శానాపతి శ్రీను సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు...

రోలుగుంట: మీ సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కె.నాయుడుపాలెం శివారు అంట్లపాలెంలో గురువారం సాయంత్రం ఆయన ఇంటింటా తిరిగారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ సంక్షేమాల గురించి వివరించారు. జగనన్న దయవల్ల వలంటీర్ల ద్వారా సంక్షేమాలు అందుతున్నాయని పలువురు లబ్ధిదారులు చెప్పడంతో. ధర్మశ్రీ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ గుములూరి సన్యాసిరాయుడు, స్థానిక నాయకులు గుములూరి బుల్లబ్బాయి, మాజీ ఎంపీటీసీ డాక్టర్ శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహం


విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల, వార్డెన్

నర్సీపట్నం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను స్థానిక సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయంలో గురువారం సత్కరించారు. అత్యధిక మార్కులు సాధించిన కె.శివజ్యోతి ప్రసాద్, వి.సాయి రాఘవ షణ్ముఖలను ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామల సత్కరించారు. ఆమె తన సొంత నిధులతో ఒకరికి రూ.5 వేలు, మరొకరికి రూ.3 వేలు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్లు బాబూరావు, ఎం.అప్పారావు, రాజేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

సురభి కళాకారులకు సత్కారం


సురభి కళాకారులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ పండగ సందర్భంగా వారం రోజులపాటు మహరాజుల కోటలో సురభి నాటకాలు ప్రదర్శించిన కళాకారులకు గురువారం ఘన సన్మానం జరిగింది. సురభి నాటక బృందం మేనేజర్ ఉపేంద్రతోపాటు కళాకారులను ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, పైడినాయుడు సత్కరించారు.

22లోగా మున్సిపల్‌లో అర్బన్ లోకల్ బాడీ అమలు

- రాష్ట్ర ఆడిట్ విభాగం డైరెక్టర్ హరిప్రకాష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రకాష్‌రెడ్డి

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ కార్యాలయాల్లో అర్బన్ లోకల్ బాడీ(ఆడిట్ ప్రక్రియ) ద్వారా ఎకౌంట్‌లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రభుత్వం జీవో నంబర్.74 విడుదల చేసిందని రాష్ట్ర ఆడిట్ విభాగం డైరెక్టర్ ఆర్.హరిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ జీవోను మొదటి సారిగా దేవదాయ శాఖలో 2022 జూలై 15న అమలు చేయడంలో మంచి ఫలితాలు సాధించామన్నారు.రెండో దఫా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలో ఈనెల 22వ తేదీలోపు అమలు చేస్తామన్నారు. జిల్లా ఆడిట్ ఇన్‌చార్జి వి.వి.నాగభూషణరావు ఆధ్వర్యంలో స్థానిక విజయ రెసిడెన్సీలో యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీ ఉద్యోగులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖలో ఫ్రీ పోస్టు ఆడిట్‌ను అమలు చేయడం వల్ల భక్తుల విరాళాలు, గుడికి వచ్చే ఆదాయం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల ఉద్యోగుల జీతాలు సకాలంలో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మూడో దఫా యూనివర్సిటీల్లోనూ, నాలుగో దఫా గ్రామ పంచాయతీల్లోను అమలు చేసేందుక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. విశాఖ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పి.సీతారామారావు, మున్సిపాలిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోలుగుంట డీటీగా వరహాలు


డీటీ వరహాలుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఆర్వోలు

రోలుగుంట: స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌గా కె.వరహాలు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఆయన రావికమతం తహసీల్దార్ కార్యాలయంలో పని చేసి ఇక్కడకు రావడంతో వీఆర్వోలంతా పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు.